

# పహరా ముక్ర

పి.టి.బాబు

రాత్రి పదింటప్పుడు ప్రజాపేటలో..

విశ్వనాథంగారి మేడమీద....

దాదాపు పదిహేనుమంది....

అంతా పురుషలక్షణ సమన్వితులే.

ఎవరి ఆలోచనలో వాళ్ళు....

వ్యక్తిగతంగా ఎవరెంత మహోద్ధండులైనప్పటికీ సహోద్యోగి ప్రసాదరావు ఆవేదనగా ఆవేశంగా చెప్పుకుపోతున్న మాటలు వినక తప్పిందికాదు.

"....మొన్నటికి మొన్న మన విశ్వనాథంగారింట్లో మూడువేలు ఖరీదుచేసే సామాన్లు పోయేయి. నిన్న మా యింట్లో నాలుగున్నర వెయ్యి ఖరీదుచేసే వజ్రపు టుంగరం మాయమైంది. ఇంత జరిగాక కూడా మనం యిలా పట్టీపట్టనట్లు ఊరుకుంటే.... ఊరు సంగతి అలా ఉంచినా, ముందు మన పేట పేటంతా మట్టి గొట్టుకుపోవడం తథ్యం. అంచేత మనమంతా ఓ నిర్ణయానికొచ్చి విచ్చలవిడిగా సాగుతున్న యీ దొంగతనాలు అరికట్టేయ్యాలి." అంటూ కర్చీఫ్‌తో ముఖం అద్దుకున్నాడు ప్రసాదరావు.... వారం రోజులు బట్టీపెట్టిన ఉపన్యాసాన్ని ఒక గంటలో ఊదిపారేసిన (డొల్ల) మంత్రి వర్యుడిలా.

ఆ వెంటనే విశ్వనాథంగారు అందుకుని, "విన్నారుగా.... అదీ అసలు విషయం. దీనిపై మీ అందరి నిష్పక్షపాతమైన అభిప్రాయాలు.... సలహాలు అవసరం." అన్నాడు మిగతా వారిపేపు చూస్తూ,

అక్కడున్న వారిలో విశ్వనాథంగారే 'పెద్ద తలకాయ' కనుక ఆ సమావేశానికి ఆయనే అధ్యక్షుడయ్యాడు. ఆయన మాటలు వినగానే అంతా ఆలోచనా కాసారాల్లో దూకి యీత కొట్టసాగేరు. మధ్యమధ్యలో— మనిషి నీట్లో మునిగినప్పుడు పై భాగంలో కనిపించే బుడగలు పగిలినప్పుడు వినిపించే శబ్దంలాంటి సణుగుళ్లు!

ఒక్కో బుఱ్ఱలోంచి ఒక్కో ఫ్లాష్..

దానిమీద కాస్సేపు డిష్యూం.... డిష్యూం....

తాగినవాడి మాటలా ఎటంటే అటు పోతున్న సలహాలు.... సూచనలు.... వాటిలో ఇద్దరికి నచ్చినది నలుగురికి నచ్చదు.

నలుగురికి నచ్చినది పదిమందికి నచ్చదు.

అందరికీ నచ్చినది ఆచరణయోగ్యం కాదు.

ఎవరికివారే ఆలోచనా సమరంలో....

తమ ఆలోచనలకి పట్టాభిషేకం చేయించాలన్న దాహంలో.... అక్కడి ఆలోచనల వేడిమికి మంచుముక్కలా కరిగిపోతోంది కాలం....

పన్నెండయ్యింది.

కనురెప్పలకి వంద కేజీల బరువులు వేలాడదీసినట్లు మూతలు పడుతోంటే బలవంతంగా కళ్లు తెరవాలని ప్రయత్నించే వాళ్ళు....

బెడ్‌రూమ్‌లో ఏవో విశేషాలు, రహస్యాలు చెబుతానన్న భార్యలగురించి ఆలోచించేవాళ్లు ...

రేపు తీసుకోబోయే లంచంలో ఎవరి కెంత వాటాలు పంచాలో ఆలోచిస్తున్న వాళ్ళు....

విశ్వనాథం ప్రసాదరావులు మాత్రం ఆ ఆలోచనలోనే.

ద్రష్టలు వీళ్ళే కనక వాళ్ళకు ఆ శ్రమ తప్పింది కాదు.

"చూడండి విశ్వనాథంగారూ మీరు ఇక్కడున్న వాళ్ళందరికంటే అన్ని విషయాల్లోనూ పెద్దవారు.... ఏదైనా తగిన మార్గం చెప్తే మీరే చెప్పాలి," అన్నారు కొందరు సగానికి పైగా స్వార్థంతో.

అందుకు సాలోచనగా తలూపిన విశ్వనాథంగారు.... "మీ అందరి కిష్ట మైతే ఓ కుక్కని పెంచుదాం" అన్నాడు మెల్లగా.

అంతే....

కొందరి నిద్ర ఎగిరిపోయింది.

కొన్ని కళ్ళు టపటప కొట్టుకున్నయ్ రెక్కలు తెగిన పక్షుల్లా. కొన్ని పరు గెత్తుతున్న ఊహలు కాళ్ళు మడతబడి ఆగిపోయేయి.

కొన్ని సూదుల్లాంటి కనుబొమలు ముడివడ్డాయి.

మరి కొన్ని మొహాలు చేటంత లయ్యేయి.

అక్కడున్న వాళ్ళందరికీ విశ్వనాథం గారి మీద అదో రకమైన గురి ఉండడం చేత ఆయన చెప్పినదాని వెనుక తాము ఆశించే 'సాన్వ జనీనత' ఉండే ఉంటుంది అనుకున్నారు. అయితే ఆయన చెప్పినదానికి అభ్యంతరం చెప్పకుండా ఆమోదించడం మందమతుల ప్రథమ లక్షణం అని భావించినవారు కనుక చీఫ్ అకౌంటెంటు రాఘవరావు అందు కున్నాడు.

"చూడండి విశ్వనాధంగారూ... మనకు రక్షణ యివ్వగల యిన్ని సదుపాయాలు.... సదవకాశాలు వుండగా మీరు ప్రత్యేకించి 'కుక్క'ని పెంచడాన్నే ఎందుకు ఎన్నుకున్నట్లు?"

అందుకు సమాధానంగా శాంతగంభీర హాసం చేసేరు విశ్వనాధంగారు.

"ప్రస్తుత సమాజంలో కుక్కకున్న స్థానం మనికి తెలీనిదేమీ కాదు. తాను తానుగా బ్రతికేందుకు అవసరమైన 'విశ్వాసం' అనే దానికి నిర్వచనం కుక్క. మనుషుల్లో ఈ లక్షణం క్రమేపీ అంతరించిపోతున్నా కుక్కలో మాత్రం అది చెక్కుచెదరకుండా ఉంది. ప్రముఖ నేర పరిశోధక సంస్థలకు సైతం చేత కాని దొంగల్ని .... దోపిడీదారుల్ని పట్టుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి ప్రస్తుతం మన ముఖ్యోద్దేశ్యం దొంగతనాల్ని అరికట్టడం కనుక, అటువంటి వాటిని అరికట్టడం కుక్కలకు సులభ సాధ్యం కనుక, అదీగాక నేటి 'సగటు కాపలా మనిషి' విశ్వాసం విషయంలో ఓ మెట్టు క్రింద ఉన్నాడు కనుక ఓ మేలుజాతి కుక్కను పెంచి మన సమస్య పరిష్కరించుకోవడం సుళువు, సబబుగా అనిపించింది. ఆ అనిపించిందే మీతో చెప్పేను. నేను చెప్పినదాన్నే ఆమోదించమనటంలేదు. నచ్చని పక్షంలో వేరే మరొకటేదైనా ఆలోచిద్దాం."

ఆయనవేపుచూసేరంతా ఆశ్చర్యంగా అనుమానంగా ....!

"ఆలోచన క్షేమగ్గానే ఉంది. మరి ఆ మేలుజాతి కుక్కని సంపాయించడమెలా....? పోషించడమెలా....? మనకు అనువుగా మార్చుకోవడమెలా?" ఇత్యాది ప్రశ్నలు బైటపెట్టేడు.... ప్రొద్దుట లేచిందగ్గర్నించి ప్రశ్నలతో విసిగిపోయి సాయంత్రానికల్లా ఓ తీరని ప్రశ్నగా మిగిలిపోయే ఎల్డీసి మూర్తి.

అతని మొహంలోని సహజమైన ఆందోళన గురించి నవ్వుతూ "అవన్నీ రేపు ఆలోచిద్దాం" అన్నారు విశ్వనాధంగారు.

ఆ విషయం మీద తర్జనభర్జనలు జరిగేక ఒక్కరొక్కరే లేచిపోయారు అంతా!

*   *   *

"ఎంతవరకు చదువుకున్నావు" ప్రశ్నించేడు ప్రసాదరావు.

"బియ్యే ఫెయిలయ్యేను" జవాబిచ్చేడతను.

"ఏవూరు?"

"అవనిగడ్డ."

ప్రసాదరావు కళ్ళలో తుఫాను బీభత్సం కరిగి నీరైంది.

"అమ్మానాన్న....?"

"వరదపాలయ్యేరు" అతని గొంతులో దుఃఖం.

"ఇలా అడుక్కునే కంటే ఏదైనా పనిచేసుకోగూడదూ?"

"చేయించుకునేవారెవ్వరు సార్!"

"మా యింట్లో పనిచేస్తావా?"

నమ్మలేనట్లు చూస్తూ "చేస్తా"నన్నట్లు తలూపేడతను.

"నీ పేరేమిటి?"

"జాకబ్."

"ఓహ్...." అంటూ లోనికి చూస్తూ, యిలా రా" అన్నాడు ప్రసాదరావు.

ధరణి వచ్చింది కళ్ళొత్తుకుంటూ. ఆమె కళ్ళ వెనుక మొన్న పోగొట్టుకున్న వజ్రపుటుంగరమే తళుక్కుమంటూ కన్నీళ్ళు గూళ్ళు కడుతున్నాయి.

"చూడు ధరణీ.... ఇతను జాకబ్ అని మనింట్లో పనిమనిషిగా నియమించేను. జీతం నిర్ణయించు."

"జీతం నిర్ణయించే ముందు ఒక్కమాట. అతని ప్రవర్తన, పనిచేసే తీరు నచ్చేక జీతం నిర్ణయించేక 'యిహ నా కేంటి' అన్నట్లు ప్రవర్తిస్తే మాత్రం తక్షణం యింటిలో నుంచి గెంటేస్తామని చెప్పండి."

అలాగేనన్నట్లు తలూపేరు జాకబ్, ప్రసాదరావులు.

"ఆఁ.... అతనికి చెప్పాల్సినవేవో చెప్పు" అంటూ ధరణివేపు చూసేడతను ఆమె ఆలోచనకి అభినందిస్తూ లోలోపల.

* * *

జాకబ్ ప్రవర్తించే తీరు.... పనిలో చలాకీతనం నచ్చేక జీతం నిర్ణయింపబడింది నలుగురితోబాటు సమానంగా!

ఓ మధ్యాహ్నం పూట అతన్ని పిలిచేడు ప్రసాదరావు.

"సీ మై బోయ్, ఈ మధ్య మా నీధిలో దొంగతనాలుమితిమీరిపోయాయి. యీ యింటిలోకూడా నాలుగున్నర వేలు విలువచేసే వజ్రపుటుంగరం పోయింది. రాత్రి వేళల్లో కాస్తంత మెళుకువగా ఉండడం మంచిది" అన్నాడు అసలు నిన్ను అపాయింట్ చేయడంలో వున్న అంతరార్థమూ అదేనన్న భావం ధ్వనించేట్లు.

ఇంతలో ఓ గొలుసు కట్టబడిన కుక్క లోనికొచ్చింది. ఆ వెనుకగా ఓ చిన్న కుర్రాడు వచ్చేడు గొలుసు పట్టుకుని.


అది చూసిన ధరణి కూరలు కలిపిన అన్నపు పళ్ళెం ఆ కుక్క ముందర ఉంచి కాళ్ళుమోడ్చి, "స్వామీ నా పోయిన వజ్రపుటుంగరం తిరిగ దొరికేటట్లుచేస్తే వారంరోజులపాటు పంచభక్ష్య పరమాన్నాలు నైవేద్యంగా సమర్పిస్తాను" అని మొక్కుకుంది.

ఈ దృశ్యం వింతగా అన్పించింది జాకబ్‌కి.

"దీనిని పహరాకుక్క అంటారు.." అని దాని ఫ్లాష్‌బాక్ అంతా పూసగుచ్చినట్టు చెప్పేడు ప్రసాదరావు.

అది విన్న జాకబ్ యిలా అనుకున్నాడు.

'యీ కుక్క.... నేను.... ఒకే రకమైన స్థానంలో ఉన్నామన్నమాట. కాక



పోతే అది సంఘ శ్రేయస్సుకోసం.... నేను ప్రసాదరావుగారి కుటుంబ శ్రేయస్సుకోసం.'

* * *

రోజు కొక్కరు చొప్పున పోషించే ఆ కుక్క 'అకార వికారాల్లో' మార్పు వచ్చింది. కాస్తంత లావెక్కింది కూడా. అది బైటికొచ్చిందంటే చాలు మిగతా కుక్కలు తోక ముడవాలి. అలా చెయ్యక పోతే వెంటబడి తరుముతుంది. (తనూ ఒకనాడు ఆ ఊరకుక్కల్లోనే తిరిగి పులి విస్తరాకులు యేరుకుతిన్నమాట ఎప్పుడో మర్చిపోయింది)

ఆ వీధిలో నివసించే.... నిశ్వసించే ప్రతిప్రాణమూ దానికి పరిచయమే. ఎవరైనా క్రొత్తమనుషులొస్తే చాలు 'గయ్' మని లేస్తుంది. ప్రక్కనున్నవారు శాంత పరిస్తే తప్ప సద్దుమణగదు. (అలా తీర్పుదు యిచ్చేరు వాళ్ళు.)

ఒకరోజు రాత్రి ఒంటిగంటప్పుడు....

వీధి మధ్య మేడలో వుంటున్న చిదంబరంగారి యింటి వెనుకగా వస్తోంది పహరా కుక్క. ఏదో 'దట్' మని పడిన చప్పుడయింది.

ఇంకేముంది. ఊరూవాడా ఆకాశమూ దద్దరిల్లేయి దాని అరుపులకి.

ఆ దెబ్బతో చేతిలోని వస్తువులు అక్కడే వదిలేసి పరుగెత్తసాగేడు. అతన్ని ఒదిలిపెట్టక తరుముతోంది కుక్క.

ఆ వీధి ఎల్లలు దాటనివ్వటంలేదు అతన్ని.

అరనిద్రలో జోగుతున్న వీధి వీధంతా మేలుకుంది.

అంతా కలిసి ఒకచోట చేరి టార్చ

లైట్లు ఫోకస్ చేసేరు కుక్క అరుస్తున్న దిక్కు కేసి.

దొంగ కంటబడేసరికి హాహాకారాలు చేస్తూ అటుకేసిపరుగులెత్తేరు ప్రజలంతా!

దొంగ పట్టుబడ్డాడు.

విశ్వనాథంగారి గేటుకి కట్టెయ్య బడ్డాడు.

అతన్ని సోదా చేస్తోంటే చిదంబరం గారింటిలో దొంగిలించిన వస్తువులు కొన్ని బైటపడ్డాయి.

నెత్తీనోరు బాదుకున్న చిదంబరం ఆ మరుక్షణం ముక్కూ నోరూ యేక మయ్యేటట్టు కొట్టేడు (కట్టేసిన) దొంగని

ఇంతవరకూ జరిగిన దొంగతనాలకు కారకుడు వీడేనన్న అనుమానంతో కడుపుమండిన చోరబాధితులతోబాటు చోద్యం చూసేవారుకూడా తలా ఓ ప్రక్కచేరి నంజుకున్నారు ఆ 'చిక్కిన' వాణ్ణి.

ఆ సంఘటన ఫలితంగా పహరా కుక్క పేరుప్రతిష్టలు దిగంతాలకు పాకేయి. దానికి జరిగే మర్యాదలు 'ఎ' క్లాసుకు చేరుకునేసరికి జాకబ్‌కి మతిపోయింది.... అణువంత విశ్వాసానికి అనంతమైన ఆదరాభిమానాలా?

ఆ కుక్కలాగే తనూ ఏదైనా మంచి పనిచేస్తే తన యజమానికూడా తనని అంతగా అభినందిస్తాడా? తనని గూర్చి ప్రజలంతా యిలాగే చెప్పుకుంటారా?

అయితే యిహనుంచి 'పహరాకుక్క' నాకు ఆదర్శం....

"ఈ పహరా కుక్కని ఓ పదిరోజుల ముందరైనా తెచ్చేరా మన సొమ్ము మనకు దక్కేది" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది ధరణి.

ఆమె నోదార్చలేక తల్లక్రిందు లయ్యేరు ప్రసాదరావు, జాకబ్‌లు.

* * *

నాసికా పుటాల్ని బ్రద్దలు చేసే మురుగు వాసన....

అయినా ఆ మురుకినీళ్ళ గుంట ఖాళీ చెయ్యక తప్పిందికాదు జాకబ్‌కి. అక్కణ్ణించి నిస్త్రాణగా.... నిరాశగా తప్పుకుంటున్న సమయంలో ఆ మురికి గుంటలో.... గులకరాళ్ళ సందుల్లో ఏదో వస్తువు కనిపించి నాలుక తడారిపోయింది.

చుట్టూ చూసేడు.

ఎవరూ లేరు.

లోపల ఎక్కడో పక్కింటావిడతో మాటాడుతోంది ధరణి.

మళ్ళీ ఆ వస్తువుకేసి చూసేడతను.

శతకోటి రత్నాలు పొదిగిన కలలు కళ్ళల్లో....!

బంగారు పూతపూసిన భవిష్యత్తు తనని రమ్మని పిలుస్తున్నట్లు....!!

ఆ వస్తువు వెనుకగా అదృష్ట దేవత పెదవుల్లోంచి జారిపడే వెన్నెల నవ్వు లాంటిదేదో శ్రవణ మనోహరంగా....!

ఆ మెరుపుల తెరల చాటుగా.... సజావుగా సాగిపోయే నవజీవన స్రవంతి

చిత్తు నమూనా వృత్తాకారంలో .... నయనానందకరంగా ....!

ఆ వస్తువు చుట్టూతా ప్రపంచమంతా ఏకమై ప్రార్థనలు చేస్తున్నా.... వాటిని త్రోసిపుచ్చి అది తనవేపే ప్రస్థానిస్తున్నట్లు....!

దాన్ని చేతిలోకి తీసుకుంటుంటే 'తప్పు' అంటూ నవనాడులూ పెద్ద పెట్టున అర్చేయి.

మనస్సు అర్థంకాని భాషలో గొణుగుతోంది.

సమంజసాసమంజసాల మధ్య ఊగిసలాడుతున్న ఊహల తరాజు ఊహించని దిక్కు కేసి ఒరిగింది.

ఆ వస్తువు తీసి జాగ్రత్తగా జేబులో వేసుకున్నాడు జాకబ్. సరిగ్గా అప్పుడే మొదలైంది అతన్లో....

భయంకరమైన వ్రణాన్ని కత్తి మొనతో కెలుకుతున్నప్పటి బాధ.... సంఘర్షణ.


పహారా కుక్క కళ్ళలో మెదిలింది.

కళ్ళు మూసుకున్నాడు.

అనంత విశ్వాన్ని పాదాక్రాంతం చేసుకుని దాని పాలనావ్యవస్థని గురించి ఆలోచించే చక్రవర్తిలా ఆలోచించ సాగేడు జాకబ్.

* * *

జీవితంలోగానీ జీతంలోగానీ మరెందులోనైనా గానీ ఒక మెట్టు పైకెక్కితే కళ్ళు నెత్తికెక్కడం ఒళ్ళు క్రొవ్వెక్కడం సహజం.




పహారా కుక్క విషయంలో అదే జరిగింది.

ఎప్పుడో ఏదో చేసిందన్న ఆనందంలో.... ఇంకా యేదేదో చేస్తుందన్న వెర్రిభ్రమలో పహారాకుక్క స్వేచ్ఛా పరిధి మరింత విస్తృతంచేసేరు పేట ప్రజలంతా. అదే వాళ్ళు చేసిన పెద్ద పొరపాటు.

కాలం గడిచేకొద్దీ.... దొంగల్ని పట్టవలసిన కుక్క దొరల్ని, ధోవతుల్ని పట్టుకులాగడం నేర్చుకుంది. ఆ వీధి వాళ్ళనే కరవబోతోంది. ఒకరిద్దర్ని కరిచింది కూడా!

యీ హఠాత్పరిణామానికి హతాశులయ్యేరు అంతా.

పాపం ఆ కుక్క మాత్రం ఎన్నాళ్ళని తినగలదు పంచభక్ష్య పరమాన్నాలు.... బిస్కెట్లకోసం.... సూపర్ క్లాస్ సుఖాలకోసం ఉబలాటపడసాగింది.

దాని కోరిక పసిగట్టిన దొంగలు.... మంచి మంచి బిస్కెట్లు పెట్టి రాత్రివేళ లలో తమ పని నిరాఘాటంగా ముగిం చుకుపోవడం మొదలెట్టేరు.

పహారాకుక్క వీధిలో తిరుగుతున్నా దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. దాని నియంతృత్వపు పోకడలు పదిమంది దృష్టికొచ్చేయి.

ఆ కుక్కను చూసిన జాకబ్ యిలా అనుకున్నాడు—

"విశ్వాసానికి మారుపేరని విజ్ఞులంతా నమ్మిన యీ పహారా కుక్క.... తనకి విశ్వాసం విషయంలో క్రొత్తపాఠాలు నేర్పిన యీ కుక్క.... తనకి ఆదర్శ ప్రాయమైన యీ కుక్క 'విశ్వాసం' విషయమే మరిచిపోగా లేనిది ఆఫ్టరాల్ 'సర్వర్'గాణ్ణి నేను విశ్వాసం మరిచి పోయినంత మాత్రాన ఒరిగే 'నష్టం' యేమిటి. నాకు చిక్కిన యీ వస్తువుతో పారిపోయి ఏదైనా సుఖవంతమైన క్రొత్త జీవితం అరంభిస్తాను. నేను పారిపోవటం ఎవ్వరికీ అనుమానం కలి గించకుండా ఉండే ప్లాన్ ఆలోచించాలి.

* * *

మదం మందమై అవహించిన మైకం కారణంగా.... కన్నూమిన్నూ కానని పహారా కుక్క విపరీత ధోరణులకు కోపోద్రిక్తులయ్యేరు ఆ పేటవాళ్ళు

మళ్ళీ విశ్వనాథంగారి మేడమీద సమావేశం....

ఈసారి చాలామంది....

వారిలో జాకబ్ కూడా....

"మనకున్న సమస్యని పరిష్కరించు కోవాలని 'పహారా కుక్క' స్థానం ఒక కల్పించి.... దాన్ని యీ ఊరకుక్కకు యిస్తే 'కనకపు సింహాసనమున' అనే పద్యం అబద్ధం కాదని సోదాహరణంగా నిరూపించింది. ఇచ్చే గౌరవ మర్యాదలు చిక్కబడేసరికి పిచ్చిదై పోయింది. ఈ పిచ్చికుక్క కాట్లకి మనమంతా బలికాక మునుపే దీని బ్రతుక్కి భరతవాక్యం పలకడమో.... అసలు ఈ ఊరునుంచే తరిమెయ్యడమో చెయ్యాలి" అన్నారు విశ్వనాథంగారు ఆవేశంగా.

అందరూ ఆయన మాటలతో ఏకీభ వించినట్లు తలలూపేరు.

ఆ మర్నాడు—

విషం కలిపిన అన్నం తిని పహారా కుక్క హృదయ విదారకమైన మరణం పొందే దృశ్యం చూస్తూ నిలబడ్డారు అంతా వృత్తాకారంలో.

ఆ దృశ్యం స్వయంగా చూసిన జాకబ్ గజగజలాడిపోయేడు.

విశ్వాసనీయులు అవిశ్వాసులైనపుడు వారికి జరిగే సన్మానం యింత నికృష్టంగా ఉంటుందా?

తిన్నయింటివాసాలు లెక్కబెడితే....

పాలిచ్చిన స్తనాలనే పారలతో పొడిస్తే....

జనంనుంచి వచ్చే కోపపు యీటెల పోట్లకి....

దావానంలా పొంగేవారి ఆగ్రహావేశాలకి....

అణగారిపోయి

చరిత్రహీనులుగా చరిత్ర కెక్కడం తథ్యమని నిరూపిస్తూ తన కళ్ళ ముందే తనువు చాలించింది పహారాకుక్క.

మూసుకుపోయిన అతని మస్తిష్కపు వాకిళ్ళని, 'తను కూడా తన యజమాని పట్ల అవిశ్వాసి అయినప్పుడు తనకి పట్టే గతికూడా యిలాగే ఉంటుందా' అన్న ఆలోచన ఛేదించడంలో చలించిపోయేడు జాకబ్.

అప్పటిదాకా తనలో కరడుగట్టిన అంధకార హిమాలయాలపై గ్రీష్మకాలాదిత్యుడు కాలుమోపినట్లయింది.

ప్రస్తుతం అతన్లో భయం.... పశ్చాత్తాపం ఉత్తుంగతరంగాల్లా.... నోళ్ళు విప్పి ఆకాశాని కేసి ఆకలిగా.... అభ్యర్థనగా!

"ప్రసాదరావుగారు ఎక్కడమ్మా" ధరణి నడిగేడు జాకబ్.

"ఇప్పుడే యింటికెళ్ళేడు" అందామె యిటువేపు తిరిగి.

వెంటనే పరుగందుకున్నాడు జాకబ్ యింటికేసి.

'ప్రసాదరావుగారికి నిజం చెప్పెయ్యాలి....'

తను బియ్యే ఫెయిలయిన మాట అబద్ధమని.... తను నిరక్షరాస్యుడనని:

ఈ యింట్లో వజ్రపుటుంగరం కాజేసింది తనే అని.... "ఆనాడు నా చేత దొంగిలింపబడిన వజ్రపుటుంగరం తొందరలో ఆ మురికిగుంటలో పడిపోయిందని.... దాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని తిరిగి పారిపోవాలని యీ యింట్లో పనిమనిషిగా ప్రవేశించేనని.... తను వచ్చినపని జయప్రదమైందని, ఆ వజ్రపుటుంగరం దొరికిందని.... కానీ ఆ వజ్రపుటుంగరం నా కొద్దని.... మీరు పంచియిచ్చే ఆదరాభిమానాలు అన్నపానీయాలే నాకు చాలని ప్రసాదరావుగారి కాళ్ళుపట్టుకు ప్రార్థించాలి.

దొంగతన మన్నాక ఏదో ఒకనాడు బైటపడకపోదని అప్పుడు తనకి ఆ కుక్కకు పట్టిన గతి పట్టక తప్పదని తెలుసుకున్నానని, దయచేసి ఆ శిక్ష నాకు విధించవద్దని తన యజమాని పాదాలమీదపడి ప్రార్థించాలి.

పరుగెత్తుతున్నాడు జాకబ్....పహారా కుక్క అడుగుల్ని చెరిపేసి క్రొత్త అడుగులు భూమ్మీద ముద్రిస్తూ.